# నర్సింగ్ రిజిస్ట్రేషన్లు లేకుంటే చర్యలు

- డీహెచ్, సెకండరీ హెల్త్ పరిధిలోని ఆస్పత్రులకు సమాచారం ఇచ్చిన నర్సింగ్ కౌన్సిల్
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలకు రంగం సిద్ధం
- 150 గంటల ఆన్‌లైన్ శిక్షణ ఉంటేనే రెన్యువల్
- నిబంధనలు పాటించని వారిపై చర్యలు: నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కె.సుశీల



**అమరావతి, ఆంధ్రప్రభ:** రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ చేసుకోకుండా విధులు నిర్వర్తిస్తున్న నర్సులపై చర్యలు తీసుకునేందుకు నర్సింగ్‌కౌన్సిల్ సిద్ధమవుతోంది. ఈమేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ పరిధిలోని ఆస్పత్రులకు సమాచారం ఇచ్చినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష ఇరవైవేల మంది నర్సులు పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 80 శాతం మంది తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోనట్లు తెలుస్తోంది. కొంతమంది నర్సింగ్ కోర్సు పూర్తి చేసినప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయించుకోకుండా, మరికొంతమంది అసలు కోర్సే పూర్తి చేయకుండా కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు నర్సింగ్ కౌన్సిల్‌కు ఇటీవలే ఫిర్యాదులందాయి. ఈక్రమంలో రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు కౌన్సిల్ ఏర్పాట్లు చేస్తోంది.

### 30 ఏళ్ళుగా రెన్యువల్స్ లేవ్

నిబంధనల ప్రకారం నర్సింగ్ కోర్సు పూర్తయిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆనక ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వాస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న నర్సుల్లో అత్యధిక శాతం మంది గత 30 ఏళ్ళుగా రెన్యువల్ చేయించుకోలేదని సమాచారం. దీనిపై కౌన్సిల్ అధికారులు పలుమార్లు సంబంధిత ఆస్పత్రుల నర్సింగ్ సూపరింటెండెంట్లకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని తెలుస్తోంది. కోర్సు అభ్యసించకుండా అరకొర శిక్షణతో కొంతమంది పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో నర్సులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరివల్ల రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. రోగి మరణించిన సందర్భాల్లో ఆస్పత్రులు వివాదాల్లో చిక్కుకుంటున్నాయి.

### ఏడాదికి 30 గంటల శిక్షణ

మారుతున్న జీవనశైలితోపాటు రోగాల సంఖ్య పెరుగుతోంది. ఎప్పుడో కోర్సు అభ్యసించినప్పుడు తీసుకున్న ట్రైనింగ్ తప్ప రోగాలకు అనుగుణంగా నర్సులు అప్‌గ్రేడ్ అవ్వడం లేదన్న విషయాన్ని నర్సింగ్ కౌన్సిల్ గుర్తించింది. ఈక్రమంలో నర్సుల్లో నాలెడ్జిని పెంపొందించడం కోసం ఏడాదికి 30 గంటలు చొప్పున ఆన్‌లైన్ మాడ్యూల్స్‌లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఐదేళ్ళకు 150 గంటలు క్రెడిట్ అవర్స్ ఉంటేనే రెన్యువల్స్ చేసేలా కొత్త నిబంధన అమల్లోకి తేనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు నర్సింగ్ కౌన్సిల్ అధికారులు యాక్షన్‌ప్లాన్ రూపొందించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### రిజిస్ట్రేషన్ లేకుండానే విధులు

ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందించడంలో నర్సులది కీలకపాత్ర. 2030నాటికి, ప్రపంచంలోని ప్రతి 6 మందిలో ఒకరు 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గలవారు అవుతారన్నారని అంచనా. వృద్ధాప్య జనాభాకు అనుగుణంగా నర్సుల సంఖ్య పెరగాల్సి ఉంది. ఒకప్పుడు అరకొర జీతాలతో దుర్భరంగా మారిన నర్సుల జీవితాల్లో కొత్త వెలుగులు తొంగిచూస్తున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో నర్సింగ్ కోర్సులకు డిమాండ్ పెరిగింది. ఇబ్బడిముబ్బడిగా నర్సింగ్ కళాశాలలు పుట్టుకొస్తున్నప్పటికీ ఆయా నర్సింగ్ విద్యా సంస్థల్లో నిబంధనల మేరకు అధ్యాపకుల నియామకం, సొంత భవనాల లభ్యత, ప్రయోగశాలల ఏర్పాటు, క్లినికల్ మెటీరియల్‌ల లభ్యత అరకొరగా ఉంటుందనేది బహిరంగ రహస్యం. కొన్ని ప్రైవేటు సంస్థల్లో అరకొర నాలెడ్జితో బయటకు వచ్చిన నర్సులు కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోకుండానే విధులు నిర్వర్తిస్తున్నారు. తక్కువ జీతాలకు పనిచేసేందుకు సిద్ధపడుతుండటంతో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు వీరికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేకపోయినప్పటికీ ఉద్యోగాలు ఇచ్చేస్తున్నాయి. రోగుల విషయంలో ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

### ఆకస్మిక తనిఖీలు చేస్తాం



రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ లేకుండా విధులు నిర్వర్తిస్తున్న నర్సులపై చర్యలు తీసుకుంటామని ఏపీ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల 'ఆంధ్రప్రభ'కు తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో నర్సుల రెన్యువల్స్‌కు సంబంధించి నర్సింగ్ సూపరిండెంటెంట్‌లకు ఆరునెలల క్రితమే సమాచారం ఇచ్చామన్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అన్ రిజిస్టర్డ్ నర్సులపై చర్యలు తీసుకోవడంతోపాటు సంబంధిత ఆస్పత్రులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. ఇందుకోసం త్వరలోనే ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఆస్పత్రులపై ఉందన్నారు.

# మాగంటి గోపినాథ్ మృతి బాధాకరం

- ఆయనతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది
- మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



**హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో**: సినీ నిర్మాత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి బాధాకరమని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన మాగంటి కుటుంబ సభ్యులను ఆదివారం సునీత పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మాగంటితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తొలిసారి తెలుగుదేశం పార్టీ నుంచే ఆయన ఎమ్మెల్యేగా గెలిచారని ఈ సందర్భంగా సునీత అన్నారు. సినీ నిర్మాతగా ఆయన పేరు గడించారని.. స్వతహాగా ఎంతో మంచి వ్యక్తిగా, అందరితో సన్నిహితంగా ఉండేవారని అన్నారు. తమ కుటుంబంతో మాగంటికి ఎంతో అనుబంధం ఉందన్నారు. తమ కుటుంబంలో జరిగిన శుభాకార్యాలకు ఆయన హాజరయ్యేవారని అన్నారు. ఎప్పుడు కనిపించినా ఎంతో ఆప్యాయంగా పలకరించేవారని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సునీత ఆకాంక్షించారు.

# ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి

**అమరావతి, ఆంధ్రప్రభ**: సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. పశ్చిమగోదావరి, కృష్ణా, కర్నూలు, కడప, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో శనివారం రాత్రితో బదిలీలు పూర్తి చేయగా.. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఆదివారం పూర్తయ్యింది. మొత్తం 31072 మంది బదిలీలు పొందారు.

ఇక బదిలీలు పూర్తయినవారు సోమవారం కొత్త పాఠశాలలో చేరేవిధంగా వెంటనే బదిలీల ఆర్డర్లు సిద్ధంచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

# సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఫీవర్




- మండల మార్పుపై భగ్గుమంటున్న సిబ్బంది
- జీఎస్‌డబ్ల్యూఎస్‌లో మొదటిసారి సాధారణ ట్రాన్స్‌ఫర్స్‌కు అవకాశం
- వార్డు సచివాలయ ఉద్యోగులకు హ్యాపీ
- గ్రామ సచివాలయ సిబ్బందికే తిప్పలు
- సొంత మండలంలోనే ఉండేలా నిబంధనలు మార్పు చేయాలని వేడుకోలు
- పదోన్నతి కల్పిస్తే పర్వాలేదంటున్న సిబ్బంది
- ఇప్పటికే ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం

**అమరావతి, ఆంధ్రప్రభ:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో బదిలీ ఫీవర్ మొదలైంది. ఈ శాఖ ఏర్పాటైన తర్వాత మొట్టమొదటి సారిగా సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ జరిగినా జనరల్ ట్రాన్స్‌ఫర్స్ మాత్రం తొలిసారి కావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. దీర్ఘకాలంగా సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి కానుంది. ఈ నేపథ్యంలో బదిలీల మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇబ్బందికరమైన అంశం లేకపోయినా, గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రం పెద్ద సమస్య ఏర్పడింది. ప్రస్తుతం ఆ మండలంలో పనిచేస్తున్న వారు తిరిగి ఆ మండలంలో నియమించే అవకాశం లేదని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. ఇతర మండలాలకు వెళ్లాల్సిందేనని ఆదేశాలు ఇచ్చింది.

### గ్రేడ్ల వారీగా సచివాలయాలు

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్ర స్థాయిలో మరింత మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జనాభా, ఆదాయం ఆధారంగా గ్రామ పంచాయతీలను ఇప్పటికే గ్రేడ్ల వారీగా విభజించేందుకు ప్రతిపాదించారు. మరోపక్క పౌర సేవలను మరింత సులభతరం చేసేవిధంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు లోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండడంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణతోపాటు, బదిలీలు ఒకేసారి జరుగునున్నాయి. గత ప్రభుత్వం సచివాలయానికి 8 నుంచి 11 మంది వరకు ఉద్యోగులను నియమించింది. తాజా మార్గదర్శకాలతో ఏ కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు, బీలో ఏడుగురు, సీలో ఎనిమిది మంది ఉద్యోగులు ఉండనున్నారు. మిగతా ఉద్యోగులను ఇతర శాఖలకు సర్దుబాటు చేయనున్నారు.

### ఐదేళ్లు పూర్తయితే బదిలీ తప్పనిసరి

గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు 2019, అక్టోబరు 2న గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ అమల్లోకి తీసుకొచ్చింది. ఏపీపీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహించి వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలను కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ బదిలీలను చేపట్టింది. అయితే ఆ సమయానికి జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ ఉద్యోగులకు ఐదేళ్ల సర్వీసు పూర్తికాలేదు. అయితే అత్యవసర, రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం ఇవ్వడంతో 20శాతం మందికే స్థానచలనం కలిగింది. అయితే తాజాగా ఇచ్చిన బదిలీల జీవో ద్వారా దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి బదిలీ తప్పనిసరి. 2025 మే నెలాఖరునాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్లకు పైగా పనిచేస్తుంటే స్థానచలనం కలగనుంది. అంటే 80 శాతానికి పైగా ఉద్యోగులు బదిలీ కానున్నారు.

### రాజకీయ కోణం

తాజా బదిలీలకు రాజకీయ రంగు కూడా అలుముకుంది. జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడడంతో అప్పుడు జరిగిన నియామకాల్లో ఎక్కువ మంది వైసీపీ అనుకూల ఉద్యోగులు ఉన్నట్లు కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా వారే కొనసాగుతుండడంతో స్థానిక టీడీపీ నేతలను వారు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల్లో వారికి అనుకూలంగా ఉన్న ఉద్యోగులను వారి సచివాలయాలకు తెప్పించుకొనేందుకు స్థానిక నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇతర మండలానికి బదిలీ తప్పనిసరి కావడంతో ప్రస్తుతం చేస్తున్న సచివాలయానికి ఆనుకొని ఉన్న మండలంలో పోస్టింగ్ తెప్పించుకునేందుకు ఉద్యోగులు సైతం తమకు తెలిసిన నేతల ద్వారా ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయల ఉద్యోగుల్లో ఎక్కువ మంది వైసీపీ వాళ్ల అన్న అపవాదు ఉంది. అయితే 30 శాతం మంది ఎస్సీ ఉద్యోగులే ఉండడంతో వారిలో ఎక్కువ మంది గత ప్రభుత్వానికి నేరుగా మద్దతు పలికారన్న ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన 30 శాతం మంది ఏ వర్గం కాకుండా ఉంటారు. అయితే వైసీపీ అనుకూలంగా ఉన్న 30 శాతం మందికి మధ్యమంగా ఉన్న ఉద్యోగులు 30 శాతం మంది కలిపి సుమారు 60 శాతం మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ఓ ఉద్యోగ సంఘ నాయకుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో వైసీపీకి అనుకూలంగా ఉన్నవారిని సాగనంపడమే లక్ష్యంగా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. వారి వారి సచివాలయాలకు టీడీపీ అనుకూలంగా ఉన్నవారిని తెచ్చుకోవడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

### పదోన్నతి కల్పించాలి

పదోన్నతి లేకుండా ప్రస్తుతం ఉన్న జీతాలతో ఇతర మండలాల్లో ఎలా జీవనం సాగించాలని పలువురు జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సొంత గ్రామానికి, లేదా మండలంలోనే విధులు నిర్వహించడంతో వచ్చే అరకొర వేతనాలతో బతుకు బండి లాగుతున్నారు. తాజా నిబంధనతో ఇతర మండలాలకు బదిలీ చేస్తే అక్కడ ఇంటి అద్దె, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతాయని, దీంతో వచ్చే జీతం సరిపోక అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పదోన్నతి కల్పిస్తే జీతం పెరగవచ్చని, దీంతో కొంత మేలు జరిగే అవకాశముంటుందని అంటున్నారు.

# జాతి అస్థిత్వానికి మూల స్తంభాలు కళలు

- ప్రముఖ సినీనటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్
- వైభవంగా తెలుగు తేజాలకు కళాభిషేకం



**చిత్తూరుకార్పొరేషన్, ఆంధ్రప్రభ:** కళలను జాతి అస్థిత్వానికి మూల స్తంభాలుగా గుర్తించే రోజు రావాలని ప్రఖ్యాత సినీ నటుడు డాక్టర్ గద్దెబాబు రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆది వారం చిత్తూరులోని స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మర్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో జాతీయస్థాయి ద్విశతాధిక కళాకారుల సమ్మేళనం తెలుగు తేజాలకు కళాభిషేకం పేరిట వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమం ఇంటర్నేషనల్ వండర్బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లో, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ (మారిషస్) లో నమోదైన ధ్రువీకరణ పత్రాలను కార్యక్రమ నిర్వాహకులు అందుకున్నారు.

ఈ కళాకారుల మహోత్సవంకు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీ నారాయణస్వామి అధ్యక్షత వహించగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, సుధా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నిద్రపోతున్న జాతిని మేల్కొలిపేది కళేనని, కళలను ప్రోత్సహించిన కారణంవల్లే గుప్తుల కాలం-రాయలవారి కాలం స్వర్ణయుగమైందన్నారు. ప్రముఖ సినీ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ శతాబ్దాల చరిత్రవున్న కళారూపం కొన్ని దశాబ్దాలపాటు అంతర్ధానమైందని, ఇలాంటి పరిస్థితులలో కళాకారుల సమ్మేళనం నిర్వహించడం అమోఘమన్నారు. డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు కూడా విద్యాలయాల్లో ప్రాధాన్యం ఇచ్చేలా తెలుగురాష్ట్రాల ప్రభుత్వాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆచార్యులు డి.జ్యోతి, వై.సుభాషిణి మాట్లాడుతూ కళలతోనే మనోవికాసం సాధ్యమన్నారు. కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య ఎం.రామనాథం నాయుడు మాట్లాడుతూ, కళలకు, విజ్ఞాన విషయాలకు ఆలయాలే ఆటపట్టులన్నారు.

### 262 మందికి కళాజ్యోతి పురస్కారాలు

వివిధ రంగాలకు సేవలందించిన 262 మందికి కళాజ్యోతి జాతీయ పురస్కారాలు-2025ను నిర్వాహకులు ప్రదానం చేశారు. డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్‌కు విశ్వ నవరస నటచక్రవర్తి, నటవిభూషణ బిరుదుల తోపాటు ఎన్టీఆర్ అంతర్జాతీయ పురస్కారాన్ని, కళాజ్యోతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ సుద్దాల అశోక్ తేజకు కవి భాస్కర బిరుదును, డాక్టర్ సుబ్రమణ్యం శర్మకు సర్వసేవారత్న బిరుదును, ఎం.వి. శ్రీధర్ రెడ్డికి సేవావిరాట్ బిరుదును, 16 మంది ఆచార్యులు- సహాయక ఆచార్యుల సమక్షంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు నవీన్, సినీ దర్శకుడు లేలీధర్రావు, సినీ సంగీతదర్శకుడు ఐశ్వంత్, ఆచార్య డి.జ్యోతి, ఆచార్య వై.సుభాషిణి, ఆచార్య వి.కృష్ణవేణి ఆచార్య డి.యువశ్రీ, ఆచార్య గంజి అరుణ, ఆచార్యులు డాక్టర్ ఆర్.లోకనాథం, డాక్టర్ వై.విజయలక్ష్మి, డాక్టర్ ఆర్.లక్ష్మీనారాయణ, డాక్టర్ హేమలత, సునీత, డాక్టర్ ఇ.నాగలక్ష్మి, కోమల, డాక్టర్। పి. లోకేశ్వరి, కె.సి.లావణ్య, డాక్టర్ జి.సుభాషిణి, పి.ఎస్. కోర్టు ఉన్నతశ్రేణి కార్య నిర్వహణాధికారి అంజనీకుమారి, ఆహ్వానసంఘం సభ్యులతోపాటు అత్యధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# నిరీక్షణ ఫలించేనా?

- కార్పొరేషన్ల ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు పొడిగింపు?
- ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్న ప్రభుత్వం

**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం త్వరలో గుడ్ న్యూస్ చెప్పేందుకు సిద్ధమవుతున్నది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో వివిధ కార్పొరేషన్ల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు కూడా 62 సంవత్సరాలకు పెంచే యోచనలో ఉంది. ఇప్పటికే గృహ నిర్మాణ సంస్థ, ఇంధన శాఖ, గురుకులాల సంస్థ, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు ఇలా పలు అనుబంధ సంస్థల ఉద్యోగులు ఈ అంశాన్ని ఇటీవల ఎన్జీవో రాష్ట్ర నేత దృష్టికి తీసుకువచ్చారు. వారి డిమాండ్లలో పదవీ విరమణ వయస్సు పెంపు అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆయా సంస్థల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

### టీడీపీ ప్రభుత్వ హయాంలోనే..

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 ఏళ్లకు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు అన్ని కార్పొరేషన్ ఉద్యోగులకు ఈ నిబంధన వర్తింపజేయడంతో అప్పట్లో ఉద్యోగ వర్గాలకు ఎంతో మేలు చేకూరింది. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసే అన్ని నిబంధనలు, బెనిఫిట్స్ కూడా కార్పొరేషన్ల ఉద్యోగులకు కూడా కల్పించడంతో ఆయా సంస్థల ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా ఉండి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. కాగా ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును గత వైసీపీ ప్రభుత్వం 62 సంవత్సరాలకు పొడిగించింది. అయితే నేరుగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకే ఇది వర్తిస్తుందని పేర్కొంది. అనుబంధ సంస్థలు, కార్పొరేషన్లు ఇతర సంస్థల ఉద్యోగులకు వయస్సు పొడిగింపు లేదని స్పష్టం చేసింది. అయితే తాము కూడా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నామని తమకు పొడిగించాలని ఆయా సంస్థల ఉద్యోగ సంఘాల నేతలు పలుమార్లు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ ఆయన ఆ వినతులను పక్కన పెట్టేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్పొరేషన్లలో పనిచేస్తున్న తమ పట్ల అప్పటి ప్రభుత్వం వివక్ష చూపడంతో రెండేళ్ల సర్వీసు కోల్పోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఖాళీ అవుతున్న గృహ నిర్మాణ సంస్థ

స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో శాశ్వత ఉద్యోగుల నియామక ప్రక్రియ లేకపోవడంతో క్రమక్రమంగా శాఖ ఖాళీ అవుతోంది. తాత్కాలిక ఉద్యోగులతో నెట్టుకురావాల్సిన పరిస్థితులు సంస్థలో ఉన్నాయి. కార్పొరేషన్ ఏర్పడినప్పుడు నియమించిన సిబ్బంది మినహా తర్వాత ఎటువంటి శాశ్వత ఉద్యోగాల భర్తీ చేపట్టలేదు. కనీసం పదవీ విరమణ వయస్సు అయినా మరో రెండేళ్లు పొడిగింపు వర్తిస్తుందనుకుంటే అదీకూడా గత వైసీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా రెండేళ్ల సర్వీసు ఉంటుండగా, గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు మాత్రం ముందుగానే పదవీ విరమణ చేయాల్సి వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 470 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతోంది. ఈ ఏడాది జనవరి నాటికి ప్రతి నెలా కొంతమంది పదవీ విరమణలు చేయనుండడంతో సుమారు 170 మంది సంస్థ నుంచి బయటకు వచ్చేస్తున్నారు. అంటే కేవలం 300 మందితోనే సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం జరిగే పనేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### ఉద్యోగుల వివరాల సేకరణ

కాగా గృహ నిర్మాణ శాఖలో దీర్ఘకాలంగా ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు. వారి వ్యక్తిగత వివరాలను పంపాలని ప్రభుత్వం గృహ నిర్మాణ సంస్థ ఉన్నతాధికారులకు ఆదేశాలు పంపింది. ఎప్పుడు చేరారు? ఎన్ని సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్నారు? పనితీరు ఎలా ఉంది? అవార్డులు, రివార్డులు అందుకున్నారా? ఏవైనా ఆరోపణలు ఉన్నాయా? తదితర అంశాలపై కూడా ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ సమాచారం ప్రభుత్వం అడుగుతుండడంతో తమ పదవీ విరమణ వయస్సు పొడిగింపు అంశంలో మళ్లీ కదలిక వచ్చినట్లైందని పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### ఇంధన శాఖలో మిశ్రమ స్పందన

ఇంధన శాఖ పరిధిలోని డిస్కంలు, ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు కూడా 60 సంవత్సరాలగానే ఉంది. అత్యవసర సేవలకు సంబంధించిన శాఖ కావడంతో నిరంతరం ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. ప్రజా సేవలకు సంబంధించిన శాఖలో ఉద్యోగుల పనితీరు కూడా ఎంతో కీలకంగా ఉంటుంది. అయితే పదవీ విరమణ వయస్సు పొడిగింపు అంశంపై ఈ శాఖలో మిశ్రమ వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఉద్యోగులు కష్టంతో కూడిన పనులు చేయాల్సి రావడంతో పదవీ విరమణ వయస్సు పొడిగింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే పరిపాలన ఉద్యోగులు, అధికారులు మాత్రం ఈ అంశంపై అనుకూలంగా ఉన్నారు.

### ఎన్జీవో సంఘం డిమాండ్

ఎన్జీవోస్ అసోసియేషన్ ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. ఈ సమయంలో జరిగిన సంస్థ డిమాండ్లలో వివిధ కార్పొరేషన్ల ఉద్యోగుల సమస్యలపై కూడా దృష్టిసారించింది. ముఖ్యంగా హౌసింగ్ ఇతర సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో 62కు పెంచాలన్న డిమాండ్‌ను ప్రభుత్వానికి నివేదించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆయా సంస్థల్లో ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. పలు శాఖల్లో ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం భర్తీచేయడం లేదు. దీంతో అనుభవజ్ఞులైన అధికారుల కొరత కూడా వేధిస్తున్నది. ఈ సమస్యల పరిష్కారానికి పదవీ విరమణ వయస్సు పొడిగింపే పరిష్కారమని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ త్వరలోనే కార్పొరేషన్ల ఉద్యోగులకు తీపి కబురు అందే అవకాశం ఉంది.


**NELCAST LIMITED**

CIN : L27109AP1982PLC003518

**Regd. Office:** 34, Industrial Estate, Gudur - 524 101. **Tel :** 08624 - 251266. **Fax :** 08624 - 252066. **Website :** www.nelcast.com **Email:** nelcast@nelcast.com

**వీడియో కాన్ఫరెన్సింగ్ / ఇతర ఆడియో విజువల్ పద్ధతుల ద్వారా జరుగనున్న 43వ వార్షిక సర్వసభ్య సమావేశం సంబంధించి సమాచారం ఇస్తూ వాటాదారులకు నోటీసు**

1. ఇందుమూలముగా వాటాదారులకు తెలియజేయునది ఏమనగా సాధారణ సర్క్యులరు నెం.లు 20/2020, తేది : మే 05, 2020, 10/2022, తేది: డిసెంబరు 28, 2022, 09/2023 తేది : సెప్టెంబర్ 25, 2023 మరియు ఇటీవలి జనరల్ సర్క్యులర్ నెం.09/2024 తేది : సెప్టెంబర్ 19,2024 మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఎ) వారిచే జారీ చేయబడిన ఇతర సంబంధిత సర్క్యులర్లతో చదవబడే కంపెనీల చట్టం 2013 (చట్టం) మరియు అందులో చేయబడిన నియమావళి మరియు సెక్యూరిటీస్ మరియు ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) (లిస్టింగ్ ఆబ్లిగేషన్లు మరియు డిస్‌క్లోజర్ ఆవశ్యకతలు), నిబంధనలు 2015 (లిస్టింగ్ రెగ్యులేషన్స్) మరియు సెబీ వారిచే జారీ చేయబడిన ఇతర సంబంధిత సర్క్యులర్లు (ఉమ్మడిగా "సంబంధిత సర్క్యులర్లు"గా పిలువబడును) కంపెనీల యొక్క వర్తించే నిబంధనలను అనుసరించి కంపెనీ యొక్క 43వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం) **శుక్రవారం ఆగస్టు 01, 2025న మ.3.30 గం.లకు (ఐఎస్‌టి)** వీడియో కాన్ఫరెన్సింగ్ (విసి) /ఇతర ఆడియో విజువల్ పద్ధతులు (ఓఎవిఎం) ద్వారా జరుగనున్న ఎజిఎం నోటీసులో పేర్కొన్న వ్యాపార విషయాలను ఆమోదించుటకు జరుగును. విసి / ఓఎవిఎం సదుపాయము ద్వారా సమావేశములో పాల్గొనుచున్న సభ్యులు చట్టం యొక్క సెక్షన్ 103 క్రింద కోరం ఉద్దేశించి పరిగణించబడతారు.
2. పై సదరు సర్క్యులర్లను అనుసరించి ఎజిఎం నోటీసు మరియు ఆర్థిక సంవత్సరం 2024-25 కొరకు కంపెనీ యొక్క వార్షిక నివేదిక ("వార్షిక నివేదిక") కంపెనీ / రిజిస్ట్రార్ & ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (ఆర్‌టిఎ) / డిపాజిటరీ పార్టిసిపెంట్స్ లతో నమోదు కాబడిన ఇ-మెయిల్ ఐడిలుగల సభ్యులకు ఎలక్ట్రానిక్ విధానంలో మాత్రమే పంపబడును. ఎజిఎం నోటీసు మరియు వార్షిక నివేదిక కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.nelcast.com, స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్లు అనగా బిఎస్ఇ లిమిటెడ్ మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వరుసగా www.bseindia.com మరియు www.nseindia.com మరియు ఎన్ఎస్‌డిఎల్ యొక్క వెబ్‌సైట్ www.evoting.nsdl.com పై కూడా అందుబాటులో ఉంచబడతాయి.
3. భౌతిక రూపంలో వాటాలు కలిగిన సభ్యులు కంపెనీ వారితో వారి ఇ-మెయిల్ చిరునామాలు మరియు మొబైల్ నెంబర్లు నమోదు కాబడని / అప్‌డేట్ చేయని వారు ఫోలియో నెంబరు యొక్క వివరాలతో ఆర్‌టిఎ వారికి పంపుట ద్వారా మరియు investor@bigshareonline.com వద్ద పాన్ కార్డ్ యొక్క స్వయం ధృవీకృత ప్రతి జతపరచుట ద్వారా నమోదు చేసుకొనుట / అప్‌డేట్ చేసుకొనవలసినదిగా కోరడమైనది.
4. భౌతిక సెక్యూరిటీలు కలిగిన వారి కొరకు కంపెనీలో వాటాలు కలిగిన వాటికి సంబంధించి వారి పాన్, ఇ-మెయిల్ చిరునామా, మొబైల్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు మరియు నామినేషన్ తెలుపుట సెబీ వారు తప్పనిసరి చేశారని సభ్యులు దయచేసి గమనించగలరు. భౌతిక రూపంలో వాటాలు కలిగిన సభ్యులు ఆర్‌టిఎ వారితో పై వివరాలు నమోదు కాబడని వారు నిర్దేశిత ఫారం ఐఎస్ఆర్-1లో ఆర్‌టిఎ వారితో వాటిని నమోదు చేసుకోవలసినదిగా కోరడమైనది. దీనికి సంబంధించి ఏవేని సందేహాల కొరకు investor@bigshareonline.com వద్ద ఆర్‌టిఎ వారికి తెలుపగలరు.
5. డిమెటీరియలైజ్డ్ రూపంలో వాటాలు కలిగిన సభ్యులు, వారి డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇ-మెయిల్ చిరునామాలు మరియు మొబైల్ నెంబర్లు నమోదు కాబడని / అప్‌డేట్ చేయని వారు వారి డిమాట్ ఖాతాలు నిర్వహిస్తున్న వారితో వారి డిపాజిటరీ పార్టిసిపెంట్లతో వారి ఇ-మెయిల్ చిరునామాలు మరియు మొబైల్ నెంబర్లు నమోదు చేసుకొనుట/ అప్‌డేట్ చేసుకొనవలసినదిగా కోరడమైనది.
6. సభ్యులు విసి/ఓఎవిఎం సదుపాయం ద్వారా మాత్రమే ఎజిఎం నకు హాజరు కావచ్చును మరియు పాల్గొనవచ్చును. ఎజిఎంలో పాల్గొనుట కొరకు మరియు రిమోట్ ఇ-ఓటింగ్‌లో పాల్గొను విధానం లేదా ఎజిఎం జరుగు కాలంలో ఇ-ఓటింగ్ విధానం ద్వారా వారి ఓటు వేయుట కొరకు సూచనలు నోటీసులో తెలుపబడినవి. విసి/ఓఎవిఎం సదుపాయం ద్వారా హాజరవుతున్న సభ్యులు కంపెనీల చట్టం 2013 యొక్క సెక్షన్ 103 క్రింద కోరం ఉద్దేశించి లెక్కింపు కొరకు పరిశీలించబడతారు.
7. ఆర్‌టిఎ/డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో ఇప్పటికే మీ ఇ-మెయిల్ ఐడి నమోదు అయిన యెడల ఇ-ఓటింగ్ కొరకు లాగిన్ వివరాలు మీ నమోదిత ఇ-మెయిల్ ఐడినకు పంపబడును
8. ఇ-మెయిల్ ఐడిలు నమోదు కాబడని వాటాదారులకు యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ /ఎజిఎం నోటీసు మరియు వార్షిక నివేదిక పొందుట కొరకు దిగువ తెల్పిన ప్రక్రియను అనుసరించవలెను.
   i. ఒక వేళ భౌతిక రూపంలో వాటాలు కలిగియున్న ఫోలియో నెం., వాటాదారుని పేరు, వాటా సర్టిఫికేట్ యొక్క స్కాన్‌చేసిన ప్రతి (ముందు మరియు వెనుక) పాన్ కార్డు యొక్క స్కాన్‌చేసిన స్వయంధృవీకృత ప్రతి మరియు ఆధార్‌కార్డు యొక్క స్కాన్‌చేసిన స్వయం ధృవీకృత ప్రతులను investor@bigshareonline.com వద్ద తెలుపవలెను.
   ii. ఒకవేళ డిమాట్ రూపంలో వాటాలు కలిగియున్న డిపాజిటరీ పార్టిసిపెంట్ ఐడి & క్లయింట్ ఐడి (16 సంఖ్యల డిపిఐడి + క్లయింట్ ఐడి లేదా 16 సంఖ్యల లబ్ధిదారుని ఐడి), పేరు, క్లయింట్ మాస్టర్ లేదా కన్సాలిడేటెడ్ ఖాతా స్టేట్‌మెంట్ యొక్క ప్రతి, పాన్‌కార్డు యొక్క స్కాన్‌చేసిన స్వయం ధృవీకృత ప్రతి మరియు ఆధార్ కార్డు యొక్క స్కాన్‌చేసిన స్వయం ధృవీకృత ప్రతులను investor@bigshareonline.com వద్ద తెలుపవలెను.
9. అందులో పొందుపర్చిన నియమావళితో చదువుకొనే చట్టం యొక్క సెక్షన్ 91 నిబంధనలు మరియు లిస్టింగ్ రెగ్యులేషన్స్ యొక్క రెగ్యులేషన్ 44 అనుసరించి కంపెనీ సభ్యుల రిజిస్టర్ మరియు వాటా బదిలీ పుస్తకాలు **శనివారం జులై 26, 2025 నుండి శుక్రవారం ఆగస్టు 01, 2025 (రెండు రోజులతో సహా)** వరకు డివిడెండ్ చెల్లింపు మరియు ఏజిఎం ఉద్దేశించి మూసి ఉంచబడుతాయి.
10. ఆదాయపన్ను చట్టం 1961 (ఐటి చట్టం)ను అనుసరించి సభ్యులకు ఇవ్వబడిన డివిడెండ్ ఆదాయం పన్ను విధించదగినది మరియు కంపెనీ ఐటి చట్టంలో నిర్దేశించిన రేట్ల వద్ద సభ్యులకు చెల్లించిన డివిడెండ్ నుండి వనరు (టిడిఎస్) వద్ద పన్ను మినహాయించవలసి ఉన్నది. వివిధ కేటగిరీల కొరకు నిర్దేశించిన రేట్లు, లేని/ ప్రాధాన్యత టిడిఎస్ కొరకు నిబంధనలు మరియు అందుకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లు/వివరాల కొరకు ఐటి చట్టం మరియు 43వ ఎజిఎం నోటీసు పరిశీలించవలసినదిగా సభ్యులను కోరడమైనది మరియు నోటీసులో తెలిపిన సూచనల ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించగలరు.
11. ఒకవేళ కంపెనీ వారు ఎలక్ట్రానిక్ బ్యాంక్ మాండేట్ యొక్క నాన్‌రిజిస్ట్రేషన్ కారణంగా ఎలక్ట్రానిక్ విధానంలో ఏ సభ్యునికైనా డివిడెండ్ చెల్లించలేకపోయినట్లు అయితే కంపెనీ నిర్దేశిత సమయంలోపు అట్టి సభ్యులకు డివిడెండ్ వారెంట్ /డిమాండ్ డ్రాఫ్టు పంపుతుంది.
12. పై సమాచారం కంపెనీ యొక్క సభ్యులందరికీ సమాచారం మరియు ప్రయోజనం కొరకు ఇవ్వబడినది మరియు పైన తెల్పిన ఎంసిఎ మరియు సెబీ సర్క్యులర్లను పాటించవలసి ఉన్నది.
13. 43వ ఎజిఎం నోటీసు మరియు వార్షిక నివేదిక తగిన సమయంలో వారి నమోదిత ఇమెయిల్ చిరునామాలకు వర్తించే చట్టాలను అనుసరించి వాటాదారులకు పంపబడును.

**By order of the Board**
**For NELCAST LTD.**

Place : Gudur
Date : 16th June, 2025

**(S.K. SIVAKUMAR)**
**Company Secretary**